# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక




ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలి
7లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 187 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 26 ఆగస్టు 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 187 26-08-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## మహిళల సహకారంతో..
# స్త్రీ శక్తి గ్రాండ్ సక్సెస్

**ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్**

**స్త్రీ శక్తి బస్సులకు రెండు వైపులా బోర్డులు పెట్టండి**

**ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు**



**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురువుతున్నాయా..? అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైన మేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యమంత్రికి వివరించారు.

- తరువాయి 2లో..



# అమెరికా 50 శాతం సుంకాలు...

## నేడు పీఎంవోలో కీలక సమావేశం

**భారత ఎగుమతులపై రెట్టింపు సుంకాలు విధించిన అమెరికా**

**బుధవారం నుంచి 50 శాతానికి పెరగనున్న పన్నుల భారం**

**రంగాల వారీగా సాయం అందించే ప్రతిపాదనపై ప్రభుత్వ మొగ్గు**

**చిన్న, మధ్యతరహా పరిశ్రమల పరిరక్షణే ప్రధాన లక్ష్యం**

**న్యూఢిల్లీ ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


భారతదేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికా సుంకాలను రెట్టింపు చేసింది. ఈ నూతన సుంకాలు ఈ బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి.

- తరువాయి 2లో..

## ప్రధాని మోదీ డిగ్రీ వివరాలు
# చెప్పనక్కర్లేదు

**సీఐసీ ఆదేశాలను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు ప్రధాని మోదీ డిగ్రీ వివరాల వివాదంపై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు**

- మిగతా 3లో..





# మండలానికో 'జన ఔషధి' స్టోర్...

**బీసీ యువతకు ఉపాధి**

**అమరావతిలో నేచరోపతి యూనివర్సిటీ...త్వరలో 'యోగా ప్రచార పరిషత్'**

**'ఆరోగ్య రథం'తో మొబైల్ వైద్యసేవలు-రాష్ట్రమంతటా ఉచిత వైద్య పరీక్షలు**

**వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**ఎన్టీఆర్ బేబీ కిట్స్ పరిశీలన... త్వరలోనే అమలుకు ఆదేశాలు**

**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగుపరచడం, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలలు, ఉచితంగా వైద్య పరీక్షలు, యోగా-నేచరోపతి అభివృద్ధి వంటి అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పేదలపై భారం తగ్గేలా ప్రతీ మండలంలో జనరిక్ ఔషధాలు లభించేలా చూడాలని భావిస్తున్న ముఖ్యమంత్రి... దీనికి సంబంధించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో



కీలక నిర్ణయం తీసుకున్నారు. జనఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి

- తరువాయి 2లో..

## ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకు
# సుప్రీంకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఫరూక్ బాషా అనే కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సోమవారం సుప్రీం ధర్మాసనం కొట్టివేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. రఘురామ, ఆయన కార్యాలయ సిబ్బంది దాడి చేశారంటూ కొన్నేళ్ల కిందట కేసు వేసిన పిటిషనర్ ఫరూక్, ఈ కేసును తాను

- తరువాయి 2లో..



## మంత్రి లోకేష్ చొరవతో గణేష్
# మండపాలకు ఉచిత విద్యుత్


**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్ళకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్ ను కోరారు. దీనిపై స్పందించిన లోకేష్... ముఖ్యమంత్రి చంద్రబాబు

- తరువాయి 2లో..

## బంగాళాఖాతంలో 48 గంటల్లో
# అల్పపీడనం ఏర్పడే అవకాశం

- **వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం**
- **అదే ప్రాంతంలో అల్పపీడనంగా మారే అవకాశం**
- **ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**
- **కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు**



**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ ముఖ్యమైన అప్‌డేట్ ఇచ్చింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయని తెలిపింది. రానున్న 48 గంటల్లో ఇది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ వివరాలను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సోమవారం వెల్లడించారు. ప్రస్తుతం ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం చురుకుగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య ఇది విస్తరించి ఉందని వివరించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుందని స్పష్టం చేశారు. ఈ వాతావరణ మార్పుల వల్ల మంగళవారం ఉత్తరాంధ్రలోని

- తరువాయి 2లో..

## రాష్ట్రంలో రైతులకు..
# ఎరువుల కొరత ఉండదు

- **వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ.**
- **2025 ఖరీఫ్ కోసం 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అంచనా వేశాం,**
- **ఇప్పటివరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశాం వెల్లడి**
- **ఎరువుల కొరత రాకుండా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ సిద్ధం**



**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దు

అమరావతి, ఆగస్ట్ 25: రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రం - రాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా వివరణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల

- తరువాయి 2లో..

# సబ్సిడీ నుంచి స్కూటర్ వరకు!

**మెప్మా సహకారం, ర్యాపిడో చొరవతో ఉపాధి పొందిన 1003 మహిళలు**

**తొమ్మిది నగరాల్లో సేవలు.. 3 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం**

**మహిళా సాధికారతే ప్రాధాన్యమన్న మంత్రి నారా లోకేష్**

**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




ఆంధ్రప్రదేశ్ మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు. మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ, ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**'ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త' స్ఫూర్తి**

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభించిన "ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త"

- తరువాయి 2లో..

## ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో
# 'డాక్టర్' కొలువులకు నోటిఫికేషన్

**ఏపీ వైద్యారోగ్య శాఖలో 185 డాక్టర్ పోస్టుల నియామకం**

**ఒప్పంద ప్రాతిపదికన చేపట్టనున్న నియామకాలు**

**మొత్తం పోస్టుల్లో 155 ఎంబీబీఎస్, 30 స్పెషలిస్టు వైద్యుల ఖాళీలు**

**పట్టణ ఆరోగ్య, ఆయుష్మాన్ కేంద్రాల్లో వైద్యుల నియామకం**

**ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**అమరావతి ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రప్రదేశ్‌లో వైద్య వృత్తిలో స్థిరపడాలనుకునే నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వైద్యారోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 185 వైద్యుల పోస్టుల భర్తీకి తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ కేంద్రాల్లో సేవలు అందించేందుకు ఈ నియామకాలను ఒప్పంద పద్ధతిలో చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, మొత్తం 185 పోస్టులలో 155 పోస్టులను ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థులతో భర్తీ చేయనున్నారు. మిగిలిన 30 పోస్టులను స్పెషలిస్టు వైద్యుల కోసం

- తరువాయి 2లో..

## క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే నాయకులకు,


# కార్యకర్తలకు పార్టీలో పెద్దపీట

## వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి






**కాకినాడ ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కాకినాడ జిల్లా కచేరిపేట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యపార్టీ కార్యకర్తలు విస్తృతంగా హాజరయ్యారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పార్టీ తలపెట్టిన కార్యక్రమాలు, జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల పై పార్టీ నాయకులతో వివరంగా చర్చించారు. జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు ఎంపికపై ప్రతిపాదనలను మంత్రి అచ్చెన్నాయుడు స్వీకరించారు. ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పార్లమెంటరీ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అందరూ ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థాయి కార్యకలాపాలలో క్రమబద్ధత, సమన్వయం అవసరమని, కొత్తగా నియమించబడిన మెయిన్ కమిటీ మరియు అనుబంధ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ బలం గ్రామాల నుండి పార్లమెంట్ స్థాయికి మరింత విస్తరించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా పార్లమెంట్ స్థాయి నాయకత్వం బలపడుతుందని, కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టసాధ్యమైన పోరాటం ద్వారానే పార్టీ విజయాలు సాధిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం




అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయనం చేసి అధిష్టానానికి నివేదిస్తామన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే నాయకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి, తెదేపా అధినేత శ్రీ నారా చంద్రబాబు గారు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని అన్నారు. కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ తెలుగుదేశం అని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

## నందమూరి బాలకృష్ణకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు.



**ఏలూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
భారతీయ సినిమా రంగంలో అగ్ర కథానాయకుడు ?నందమూరి బాలకృష్ణకు లండన్ కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ గోల్డ్ ఎడిషన్ లో చోటు దక్కడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు తెలిపారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవం పొందిన తొలి నటుడుగా బాలకృష్ణ నిలవటం తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. తన తండ్రి ఎన్టీఆర్ గారి పేరు ప్రతిష్టలను నిలబెడుతూ, సినీ రంగంతో పాటు రాజకీయ, సేవా రంగాల్లో కూడా ఎదురులేకుండా దూసుకుపోతున్న బాలకృష్ణ గారిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. 1975లో వచ్చిన అన్నదమ్ముల అనుబంధం' చిత్రం నుంచి ఇటీవలే వచ్చిన డాకూ మహారాజ్ వరకూ హీరోగా 50 ఏళ్ల సినీ ప్రస్థానంలో 109 సినిమాలలో నటించిన పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కామినేని



**కైకలూరు (ముదినేపల్లి), ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఈరోజు గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ గారు ముదినేపల్లి మండలం కోడూరు గ్రామములో నరేగా నిధులుతో నిర్మించిన సీసీ రోడ్డు, పంచాయతీ మంచినీటి చెరువు నూతన ఫెన్సింగ్ మరియు పంచాయితీ భవనం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని గారు మాట్లాడుతు కూటమి ప్రభుత్వంలో పంచాయితీలు కళకళ లాడుతున్నాయి గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన నిధులను కూడా మళ్లించి దుర్వినియోగం చేసారని అన్నారు. మన కూటమి ప్రభుత్వంలో నరేగా నిధులు ద్వారా మరియు ఇతర ప్రభుత్వ నిధులుతో ఇలా పంచాయితీలు అభివృద్ధి చెందుతున్నాయి తెలిపారు. ఇప్పటికే సీసీ రోడ్లు 90% వరకు పూర్తి అయ్యాయని మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేస్తాము అని తెలిపారు. అనంతరం పెనుమల్లి గ్రామస్థులు లుక్కా అరుణకుమారి %ఔ/శీ% వీరేశ్వరరావు గారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హాస్పిటల్ బిల్స్ నిమిత్తం మంజూరైనా రూ. 1,92,000/- చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో %చీణూ% నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ



**చింతలపూడి, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
చింతలపూడి లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్నటువంటి సిబ్బందితో మాట్లాడారు. అటెండన్స్ ఎలా మైంటైన్ చేస్తున్నారు, రికార్డ్స్ అన్ని ఫర్ఫెక్ట్‌గా ఉన్నాయా లేదా, సుమారు వారం రోజుల్లో ఎన్ని కంప్లైంట్స్ మీరు దృష్టికి వస్తున్నాయి, అవి ఎలాంటి కంప్లైంట్స్ వంటి వాటిని పరిశీలించారు. ఎప్పటికప్పుడు విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే తగు చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తాం..

## రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



**నూజివీడు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రాష్ట్రంలో గత కొంతకాలంగా జరుగుతున్న అర్హులైన పింఛన్ దారుల జాబితా రీవైద్య పరీక్షల్లో కొంతమంది పింఛన్లు కోల్పోవడం పై ఆందోళన చెందడంతో మంత్రివర్యులు నూజివీడు నియోజకవర్గ మండల అధికారులు, మరియు మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి. మాట్లాడుతూ పింఛన్ల,తొలగింపు,పునరుద్ధరణపై అధికారులంతా పారదర్శకంగా పని చేయాలని అన్నారు. ఒక్కొక్క మండల అధికారులతో సమీక్షించి ఎంత మంది పింఛన్లు కోల్పోయారు,ఎంత మంది అర్హులు వారి జాబితా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. వైద్యపరీక్షలు, వైద్య పత్రాలు మంజూరులో ఎటువంటి అవక తవకలు జరగకుండా పారదర్శకంగా పని చేయవలసి బాధ్యత అందరిపై ఉందని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి, పింఛన్లు అందేలా ప్రభుత్వ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని చూసించారు. పింఛన్లు అందించడంలో ప్రజల నమ్మకాన్ని,విశ్వాసాన్ని కోల్పోకుండా అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. వచ్చేనెల 1వ తేదీ నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ, పింఛన్లు అందేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించిన మంత్రివర్యుల. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు రూరల్,మరియు ఆగిరిపల్లి,మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ డిగ్రీ వివరాలు చెప్పనక్కర్లేదు: సీఐసీ ఆదేశాలను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

### ప్రధాని మోదీ డిగ్రీ వివరాల వివాదంపై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతలకు సంబంధించిన వివాదంపై ఢిల్లీ హైకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. ఆయన బ్యాచిలర్ డిగ్రీ (బీఏ) వివరాలను వెల్లడించాలంటూ ఢిల్లీ యూనివర్సిటీని (డీయూ) ఆదేశిస్తూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) జారీ చేసిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. జస్టిస్ సచిన్ దత్తా ఈ మేరకు తీర్పును ప్రకటించారు. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ గతంలో హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ పూర్తిచేసిన న్యాయస్థానం, తాజాగా యూనివర్సిటీ వాదనలతో ఏకీభవించింది. 1978లో బీఏ ఉత్తీర్ణులైన విద్యార్థుల రికార్డులను పరిశీలించేందుకు అనుమతించాలంటూ నీరజ్ అనే వ్యక్తి చేసిన ఆర్టీఐ దరఖాస్తు మేరకు సీఐసీ 2016లో ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఈ ఉత్తర్వులపై హైకోర్టు 2017లోనే స్టే విధించింది. విచారణ సందర్భంగా ఢిల్లీ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. విద్యార్థుల రికార్డులను విశ్వాసంతో భద్రపరిచే బాధ్యత తమపై ఉందని, వాటిని గోప్యంగా ఉంచాల్సి ఉంటుందని కోర్టుకు తెలిపారు. కేవలం తెలుసుకోవాలన్న ఉత్సుకత కోసం, విస్తృత ప్రజా ప్రయోజనం లేనప్పుడు ఆర్టీఐ చట్టం కింద ఆ సమాచారాన్ని బహిర్గతం చేయలేమని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ 1978లో బీఏ డిగ్రీ పొందినట్లు తమ వద్ద రికార్డులు ఉన్నాయని, వాటిని కోర్టుకు చూపడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కూడా పేర్కొన్నారు. మరోవైపు, ఆర్టీఐ దరఖాస్తుదారు తరఫు న్యాయవాది... ప్రధాని విద్యా వివరాలు తెలుసుకోవడంలో విస్తృత ప్రజా ప్రయోజనం ఉందని వాదించారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన హైకోర్టు, ఢిల్లీ యూనివర్సిటీ వాదనకే మొగ్గుచూపి సీఐసీ ఆదేశాలను రద్దు చేసింది. తాజా తీర్పుతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.

## శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్ళు ఉచిత పంపిణీ



**ఏలూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏలూరు, ఆగష్టు, 25 బీ జిల్లాలో అర్హులైన ప్రతీ విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలు వద్ద సోమవారం (1) బొర్రా సుదాకరమ్మ, (2) షేక్ ఇస్మాయిల్ యిద్దరు విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లను, ఇద్దరు వయోవృద్ధులు చేతి కర్రలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగిన ప్రతీ విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించడం జరుగుతుందని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. రామ్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

## కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో ముందస్తుగా


# ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చెయ్యాలి

- **నాలుగు రోజుల్లో పరిష్కారం చేస్తా అన్న అధికారులు జాడ ఎక్కడ**
- **డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ డిమాండ్**



**ఏలూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
డి.ఎస్సి ద్వార నియామకం చేయనున్న ఉపాధ్యాయులు పోస్టులు ముందుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో భర్తీ చెయ్యాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమవారం నాడు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు పోస్టులు నియామకం గురించి పిజిఆర్ఎస్ లో కలెక్టర్ వెట్రి సెల్వికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ జూన్,జూలై లో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ సందర్భంగా ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలోని కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో టీచర్స్ కొరత ఏర్పడటంతో విద్యార్థిని, విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరిగింది అని కుక్కునూరు మండలంలో మొత్తం 46 పాఠశాలలు ఉన్నాయి. మండలానికి కేటాయించిన పోస్టులు 141 కానీ ప్రస్తుతం మండలంలో ఉన్న ఉపాధ్యాయుల 46 మంది ఉన్నారు. ఇంకా 95 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో మొత్తం 43 పాఠశాలలు ఉన్నాయి. మండలానికి కేటాయించిన పోస్టులు 95 కానీ ప్రస్తుతం మండలంలో ఉన్న ఉపాధ్యాయుల 43 మంది ఉన్నారు. ఇంకా 44 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కొక్క స్కూల్ లో సుమారు 100 నుండి 125 మంది విద్యార్థిని, విద్యార్థులున్నారు. ఈ పాఠశాలలో ఉన్న టీచర్ కేవలం ఆ పిల్లలను సర్ధిచూసుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప పాఠ్యాంశాలు చెప్పడానికి తగిన సమయం సరిపోక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తద్వారా షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు విద్య అందించడంలో తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. గిరిజన పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ సందర్భంగా ఈ పరిస్థితిని అధికారులు ముందుగా అంచనా వేయకపోవడం బాధాకరం. కుక్కునూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంఈఓ బాబూరావు గారు ఇంత జరుగుతున్న మండలంలో ఉన్న స్కూల్స్ ను సందర్శించడం కానీ, సమస్యకు పరిష్కరం చూపకపోవడం లో విఫలం అవుతున్నారని కుక్కునూరు మండలంలో ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ చెయ్యాలని జూలై 16,17వ తేదీల్లో రెండు రోజులు పాటు అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగింది. ఆ దీక్షలకు జిల్లా విద్యాధికారి ఏ.ఎమ్.ఓ శ్రీను ని దీక్ష శిబిరానికి పంపించి ఫోన్లో మాట్లాడుతూ నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని చెప్పారు. కానీ నేటికీ భర్తీ జరగలేదు. నాలుగు రోజుల్లో టీచర్లు పోస్టులు భర్తీ చేస్తా అని నేటికి పరిష్కారం చెయ్యలేదు. ఇప్పటికే విద్య సంవత్సరం ప్రారంభం అయ్యి మూడు నెలలు కావొస్తుంది. కావున తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి డి.ఎస్సి ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ చేయాలని సూర్యకిరణ్ డిమాండ్ చేశారు.

## ఎఐ ఆధారిత డిజిటల్ విధానం ద్వారా ఫిర్యాదుల స్వీకరణ



**ఏలూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏలూరులో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత డిజిటల్ విధానాన్ని వినియోగించి, ఫిర్యాదుల పరిష్కార వేదిక ను ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీ ఎన్. సూర్య చంద్రరావు గారి ఆధ్వర్యంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత డిజిటల్ విధానాన్ని వినియోగించి, ఫిర్యాదుల స్వీకరణ ను పారదర్శకంగా, పేపర్ లెస్ గా నిర్వహించారు. ఫిర్యాదుదారులు స్వయంగా AI బోట్ కు తమ ఫిర్యాదులు తెలియ చేసిన వెంటనే డాక్యుమెంటు గా తయారయ్యే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. ప్రజలు తమ యొక్క డబ్బులను సమయమును వృధా చేసుకోకుండా మీ యొక్క ఫిర్యాదులను సమీప సబ్ డివిజన్, సర్కిల్ లేదా జిల్లా పోలీసు అధికారులకు నేరుగా అందజేయవచ్చును అని, అలాగే https://meekosam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ ఫిర్యాదులు చేసుకునే అవకాశం ఉంది. ఫిర్యాదు స్థితి తెలుసుకోవాలంటే 1100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు. ఈరోజు మొత్తం 49 ఫిర్యాదులు అందగా, వాటిలో ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, మోసపూరిత లావా దేవీలు ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారుల తో నేరుగా ముఖాముఖి మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ రానున్న వినాయక చవితి నేపథ్యంలో ప్రజలు అందరికీ కూడా ముందుగా శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ తెలియ చేసినారు. వినాయక చవితి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసే విగ్రహాల దగ్గర తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆ దేవుని యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు తెలియజేస్తున్నారు ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదిదారులు కోసం ఏలూరు శ్రీ సత్య సాయి సేవ సంఘం తరపున భోజన ఏర్పాట్లు చేసినారు

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## అమ్మ ఫుడ్స్ & ప్రొడక్ట్స్ డైరీని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు







**కొత్తపేట, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కొత్తపేట మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సంగం డైరీ వారి అమ్మ ఫుడ్స్ అండ్ ప్రొడక్ట్స్ డైరీ ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం తన చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రొప్రైటర్ ఎన్.ఎన్ మూర్తికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.వ్యాపారాభివృద్ధి జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్,గనిశెట్టి వీరేష్, చవల జగన్నాధం,సదే శ్రీనివాస్, చిక్కం శివాజీ,యెలిశెట్టి ప్రభాకర్,వైవీ కృష్ణ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.


## పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....



**అమలాపురం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్ నందు జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో పరిశీకులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,ప్రభుత్వ చీఫ్ విప్ జి. వి ఆంజనేయులు,రాష్ట్ర చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం,ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మధుర్ మరియు సహచర ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు.

## వైభవంగా జనార్ధన స్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

### ప్రమాణస్వీకారం చేయించిన కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్



**ఆలమూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అతిరథ, మహారధుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ ఈ ప్రమాణస్వీకారానికి హాజరై కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్ గా బైరిశెట్టి రాంబాబు, సభ్యులుగా బొబ్బా రాంబాబు, అయినవిల్లి వీర వెంకట సత్యనారాయణ మూర్తి, కట్టా శ్రీనివాస్, కొప్పాడి జయరాజు, ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, దారా దుర్గాభవాని, సబ్బవరపు రామాయమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడియంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కడియం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేఖరి**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు మరింత పారదర్శకంగా నిత్యవసర వస్తువులను పొందుతారని కడియం ఎంపిపి వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. కడియంలో, గ్రామ రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో, సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరిచే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులందరికీ అందేలాగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సునీల్ కుమార్, గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, పంచాయితీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.







## జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం

### సంస్థాగత ఎన్నికల నిర్మాణం











**అమలాపురం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్ జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీమతి రెడ్డి అనంత కుమారి గారి అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి పరిశీలకులు , ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనింగ్ , ఎక్సైజ్ మంత్రి వర్యులు శ్రీ కొల్లు రవీంద్ర గార, ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జి.వి.ఆంజనేయులు గారు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, DCMS ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, బొల్లా సతీష్, పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా మంత్రివర్యులు శ్రీ వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్ శ్రీ దాట్ల బుచ్చిబాబు, పార్లమెంట్ సభ్యులు శ్రీ గంటి హరీష్ మాధుర్, కొత్తపేట శాసనసభ్యులు శ్రీ బండారు సత్యానందరావు, మండపేట శాసనసభ్యులు శ్రీ వేగుళ్ళ జోగేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గం కన్వీనర్ శ్రీ నామన రాంబాబు, కో కన్వీనర్ శ్రీ మోకా ఆనంద్ సాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర sc సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కంకటాల రామం,రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, రోళ్ళపాలెం సొసైటీ అధ్యక్షులు మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయ వెంకటలక్ష్మి బాబ్జి, మాడ మాధవి మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు, మాజీ కౌన్సిలర్ దున్నలా దుర్గా, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, ఉప్పలగుప్తం మండలం టిడిపి అధ్యక్షులు అరిగేలా నానాజీ, చిల్లా జగదీశ్వరి, మాజీ zptc దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఆకెటి పెద్ద, వేగిరాజు వెంకటరాజు, గంధం శ్రీను, నల్లా చిట్టి, వలవల శివరావు, చింతా శంకరమూర్తి మరియు మాజీ శాసనసభ్యులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంస్థల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు, నియోజకవర్గాల పరిశీలకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

















## కలెక్టరేట్‌పై స్పష్టత ఇవ్వండి..

### శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు...



**భీమవరం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
భీమవరం లోని ప్రదానంగా అన్నిజిల్లా కార్యాలయాల సముదాయం జిల్లా కలెక్టరేట్ ఇప్పుడు నియోజక వర్గ ప్రజల్లో చర్చనీయంశంగా మారింది. అందుకు ఇటీవల అధికార పార్టీకి చెందిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కాళ్ళ మండలం పెద అమిరంలో శాశ్వత నిర్మాణానికి అయన పావులు కదపున్నట్లు అనధికారికంగా చర్చ నడుస్తున్న నేపథ్యంలో, భీమవరంనియోజక వర్గం నుండి ప్రజల మద్దతుతో మూడు సార్లు మూడు పార్టీలనుండి ఎమ్మెల్యే కాబడిన పులపర్తి రామాంజనేయులు ఈ అంశంపై మౌనంవీడి కలెక్టరేట్ తరలిపోతుందో, లేక గతంలో గత ప్రభుత్వం విడుదలచేసిన జి ఓ. ప్రకారం నిర్మాణం కొనసాగుతుందో, తేల్చిచెప్పాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు విలేఖ రుల సమావేశంలో కలెక్టరేట్ అంశంపై కొన్ని విధానపరమైన అంశాలను వివరించడం జరిగింది. గత ప్రభుత్వం భవననిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ఆగడంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం జరుగుతున్న అసత్య గంధర గోళ పరిణామలపై స్పందిస్తూ..ఎమ్మెల్యే అంజి బాబు కలెక్టరేట్ ఎక్కడికి తరలిపోదని, అయన వంతు సహకారంగా ఐదు ఎకరాలు ఇస్తానని చెప్పారని, కలెక్టరేట్ అంశం ఏఒక్కరిది కాదని నియోజక వర్గ ప్రజలమనోభీష్టమని, ప్రజల్ని కాదని వ్యతిరేక నిర్ణయాలు జరిగితే ప్రజలనుండి ఆగ్రహం వ్యక్తిమోతుందని. ఇది నియోజక వర్గ అన్ని పార్టీల భాగస్వామ్యం ఉంటుందని కేవలం ప్రభుత్వాలు వ్యక్తులకోసం పనిచెయ్యవని అలా అయితే, ప్రతి డబ్బున్న అసామీ నిబంధనలు మార్చేసుకుంటారని. ఆ ప్రజాప్రతినిధి పి4 అంశాన్ని తెరపైకి తెస్తే నిజంగా ఆవిధమైన కొత్తనిబందనలు చెల్లుబాటు కావని. ఈ అంశం ప్రజా ఉద్యమంగా మారకముందే భీమవరం శాసన సభ్యులు స్పష్టత ఇవ్వాలని విలేఖరుల సమావేశంలో అయన పేర్కొన్నారు.. ,మవరం నుండి కలెక్టరేట్ తరలి వెళ్ళి పోతే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

## చిన అమిరంలో నూతన ఆర్టీసి బస్టాండ్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రతి ఊరికి ఆర్టీసీ బస్సు రావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అదే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామ పంచాయతీ ఎస్ఆర్ కేఆర్ కళాశాల ఎదురుగా ఆర్టీసి బస్టాండ్ కు సోమవారం ఎమ్మెల్యే అంజిబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో భీమవరం హాస్పిటల్ సహకారంతో నూతన బస్టాండ్ ను నిర్మించడం అభినందనీయమని, ప్రయాణికులు విద్యార్థులు ఈ బస్టాండ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతి త్వరలోనే అందుబాటులోకి తీసుకొని వచ్చేలా పనులు వేగవంతం చేయాలని అన్నారు. దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పట్టని మున్సిపల్ అధికారులు

**(2025 ఆగష్టు 25, తెలుగు రాష్ట్రం, బాపట్ల ప్రతినిధి)**



బాపట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంతో... ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని రోడ్లపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి దాపరించింది. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం తో పట్టణంలో వీధి కుక్కలు, ఆవుల సమస్య రోజురోజుకూ పెరిగిపోతుంది. ఎక్కడపడితే అక్కడ రహదారుల వెంబడి, రోడ్ల మధ్యలో తిష్ట వేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ ప్రయాణికులు రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వీటి వల్ల కొన్ని సార్లు ట్రాఫిక్?కు అంతరాయం కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. అలాగే నిత్యం ఏదో ఒక వీధిలో, ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతూనే ఉన్నారు. పిల్లలు, పెద్దలు, ఆడ, మగ అని తేడా లేకుండా కనిపించిన వారిని కనిపించిన చోట వీధి కుక్కలు వెంటాడుతూనే ఉన్నాయి, కరుస్తూనే ఉన్నాయి. బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఇక ఆవులు విషయానికొస్తే ఇటీవల విజయలక్ష్మిపురం సమీపంలో ఆవును తప్పించబోయి ఓ మహిళ ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయింది. దీంతో ఆమె స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అలాగే గతంలో జి బి సి రోడ్డులో ఓ ద్విచక్ర వాహనదారుడు ఎద్దును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల యొక్క ప్రాణాలు కాపాడాలని పుర ప్రజలు కోరుకుంటున్నారు.

## అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

### జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్

**( 2025 ఆగష్టు 25, తెలుగు రాష్ట్రం, బాపట్ల ప్రతినిధి )**



అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 58 మంది అర్జీలను అందాయని సమాచారం. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ పి.జి.ఆర్.ఎస్ సెల్ సీఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**జగ్గయ్యపేట, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేకరి):**

పెనుగంచిప్రోలు గ్రామంలోని వ్యవసాయ సొసైటీ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కొత్త పథకాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నామని తెలిపారు. “దీపం” పథకం, “తల్లికి వందనం”, “స్త్రీ శక్తి”, “అన్నదాత సుఖీభవ” వంటి పథకాల ద్వారా మహిళలు, రైతులు, పేద కుటుంబాలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఇప్పుడు అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా మరింత పారదర్శకతతో, వేగవంతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారుల దాకా చేరుతాయని పేర్కొన్నారు. ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, పాక్స్ చైర్మన్ కర్ల వెంకటనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు కార్ల నాగేశ్వరరావు, యనమదల నరసింహారావు, సొసైటీ సభ్యులు కనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యం

**-ఎఫ్టానిక్స్ సిఈఓ దాసరి రామకృష్ణ**



**తాడేపల్లిగూడెం, ఆగస్ట్ 25 (తెలుగురాష్ట్రం విలేకరి):**

పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమని ఎఫ్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈఓ దాసరి రామకృష్ణ సూచించారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ లో ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రామ్ ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రగతిలో టెక్నాలజీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు అంతర్జాలంతో స్నేహం చేస్తే మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవచ్చని సూచించారు. ఇంజినీరింగ్ చేసే విద్యార్థుల కొలువులకు కొదవలేదని చెప్పారు. విద్యనభ్యసించాల్సిన వయసులో తాత్కాలిక ఆనందాలకు లొంగిపోతే భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. సద్బుద్ధి, సంకల్పం, పట్టుదల, కృషి వంటి వాటిని తమ లక్ష్యసిద్ధికి సోపానాలుగా మలుసుకున్న విద్యార్థులు విజయ శిఖరాలను సులువుగా అధిరోహిస్తారని చెప్పారు. ఓ వినూత్న ఆలోచన ప్రపంచ స్వరూపాన్నే మార్చి వేస్తుందని, విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న కఠిన సవాళ్లను అధిగమించేందుకు నూతన ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలని వివరించారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ దేశంలో 31వ నిట్ గా అవతరించిన ఏపీ నిట్ పదేళ్ల ప్రస్తానాన్ని పూర్తిచేసుకుందని తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను కాలయాపన చేయకుండా పట్టుదలతో సాధించిన విద్యార్థులు మార్గదర్శకులై ప్రకాశిస్తారని చెప్పారు. కృత్రిమమేధ, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. నైపుణ్యాలకు సాంకేతికతను జోడిస్తే ఎన్నో అద్భుతాలు రూపుదిద్దుకుంటాయని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. సంస్థలోని విద్యార్థుల కోసం ఎన్నో సౌకర్యాలు, వనరులను సమకూరుస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్, డీన్ అకడమిక్ డాక్టర్ కే. హిమబిందు, డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సంస్థ నియమ, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఇండక్షన్ కార్యక్రమం సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టరేట్ ముందు రైతులు ధర్నా.. వినతిపత్రం..**



**ఏలూరు, ఆగస్టు 25(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని, పరిహారం పెంచి ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. పి జి ఆర్ ఎస్ లో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి కి వినతి పత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారుల బృందం పర్యటన చేసి రైతుల సమస్యలపై నివేదిక ఎందుకు ఇవ్వలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటిలోగా గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంతాలలో అధికారులు పర్యటన చేసేలా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. అనంతరం జరిగిన ధర్నానుద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను హైవే అథారిటీ అధికారులు, భూసేకరణ అధికారులు తుంగలో తొక్కడం దారుణమని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కు సర్వీస్ రోడ్లు లేకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, పంటలు తెచ్చుకునే అవకాశం లేక నానా తంటాలు పడుతున్నారని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రోడ్లను తారు రోడ్లుగా నిర్మాణం చేయాలని కోరారు. భూసేకరణలో అతి తక్కువ పరిహారం ఇవ్వడం వలన రైతులు నష్టపోయారని ఆర్బిట్రేషన్ల ద్వారా తగు న్యాయం చేయాలన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వలన నష్టపోతున్న రైతులను అన్ని విధాల ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 2న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే దిగ్బంధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం జరుగుతుందని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి, కె. పిచ్చి రెడ్డి,జి. లక్ష్మీరెడ్డి,ఇర్ల శ్రీనివాసరెడ్డి, డి. సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అర్హులెవరికీ పెన్షన్ తొలగించరు

**అర్హులందరికీ పింఛన్లు అందాలన్నదే ప్రభుత్వ ఆశయం**

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ఏలూరు, ఆగస్టు 25( తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్ యస్ కార్యక్రమానికి తమ సమస్యలను తెలియజేసేందుకు వచ్చిన దివ్యాంగులు వద్దకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వయంగా దివ్యాంగులు చెంతకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. దివ్యాంగులు బొర్రా సుధాకరమ్మ, ఇద్దాబత్తుల ప్రసన్న,నక్కా రాము,యు.ప్రవీణ్ కుమారిలు మాకు నోటీసులు అందాయని, పెన్షన్లు ఆగుతాయని అంటున్నారని కలవటానికి వచ్చామని చెప్పారు. దీంతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్పందిస్తూ పింఛన్ల విషయంలో అర్హులైన దివ్యాంగులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. నూరుశాతం అర్హులకు పింఛన్లు అందాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. నోటీసులు ఇచ్చినవారికి త్వరితగతిన విచారణ చేసి అర్హులకు యధాతథంగా పింఛన్లను అందజేస్తామని, దివ్యాంగులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టరు భరోసానిచ్చారు. పుకార్లు, వదంతులు నమ్మవద్దని,అర్హత ఉన్న పింఛన్లన్నీ యథావిధిగా కొనసాగు తాయని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. దివ్యాంగులకు సమస్యలు ఏమి ఉన్నా తనను స్వయంగా తనని కలిసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎక్కువ మంది వచ్చి సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దని జిల్లా కలెక్టరు హితవు పలికారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం, దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది పుష్కర ఘాట్‌లో ‘శుభంకర మహా గణపతి’

**-గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి వెల్లడి**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

గడిచిన 15ఏళ్లుగా ప్రతియేటా ఒక్కొక్క రకంగా గణపతిని ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది శుభంకర మహాగణపతిని రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించనున్నట్టు నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి వెల్లడించారు. స్థానిక పుష్కర ఘాట్‌లో సర్వ కార్యసిద్ధి, సకల శుభాలు కలిగించే శుభంకర మహాగణపతి కొలువు దీరనున్న నేపథ్యంలో స్థానిక పుష్కర ఘాట్ వద్ద సోమవారం ఏర్పాటుచేసిన మీడియా జక్కంపూడి విజయలక్ష్మితో పాటు కమిటీ ప్రతినిధులు చల్లా శంకర్రావు, పొలసానపల్లి హనుమంతరావు, బ్కెర్రాజు ప్రసాదరాజు, నందెపు శ్రీనివాస్ మాట్లాడారు. 2010లో జక్కంపూడి రామ్మోహనరావు వ్యవస్థాపకునిగా రాజమహేంద్రి గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటుచేసి గణపతి నవరాత్రులు మొదలు పెట్టామని గుర్తుచేసారు. లడ్డుతో, పెన్నులతో, గాజులతో, విభూది, పసుపు ఇలా ఒక్కో ఏడాది ఒక్కో రకంగా గణపతిని ప్రతిష్టించామని చివరి రోజున ప్రసాదంగా భక్తులకు అందించామని ఆమె గుర్తుచేసారు. ఈ ఏడాది 16వ వార్షిక ఉత్సవాల్లో 18 అడుగులు ఎత్కెన శుభంకర మహా గణపతి (వినాయకి) విగ్రహాన్ని నూలు పోగులు, పసుపుతాడుతో రూపొందిస్తున్నామని విజయ లక్ష్మి చెప్పారు. స్త్రీ రూపంలో గణపతిని ప్రతిష్ట చేస్తున్నామన్నారు. ఇది ఒక విధంగా శక్తి గణపతి అని ఆమె పురాణాలను ఉటంకిస్తూ చెప్పారు. వినాయకుడి గురించి శాస్త్రపరంగా స్కంద, వాయు, లింగ, మత్స పురాణాల్లో ప్రస్తావన ఉందని ఆమె తెలిపారు.

## బాల్య వివాహాల పై అవగాహన కార్యక్రమం




**చింతలపూడి, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేఖరి) :**

బాల్య వివాహాలు గర్భధారణతో కలిగే నష్టాలపై చింతలపూడి నాగిరెడ్డి గూడెం గురుకుల పాఠశాలలో చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్. మధు బాబు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన ఆరోగ్య సమస్యలతో పాటు తల్లి బిడ్డ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని జడ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ టి.సత్యవతి, సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. క్రాంతి కుమార్,మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కిరణ్ బాబు, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, స్కూల్ ప్రిన్సిపల్ హేమలత, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

## ఐటీసీ బంగారు భవిష్యత్తు



**కూనవరం, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

ఐటీసీ బంగారు భవిష్యత్ వారి సహకారంతో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ వారి అధ్వర్యంలో ఎటపాక మండలం బుట్టయిగూడెం గ్రామంలో రైతులకు పండ్ల మొక్కలు, అడవి జాతి మొక్కలను రైతులకు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్ మాట్లాడుతూ ఐటీసీ సహకారంతో మా సంస్థ ద్వారా రైతులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీడీఓ ఎం శ్రీనివాస్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ సతీష్, బుచ్చి రాజు, ఐటీసీ బంగారు భవిష్యత్తు మేనేజర్ సాగర్, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్ సంస్థ సిబ్బంది రైతులు హాజరు కావడం జరిగింది.

## రైతు పక్షపాతి గారపాటి

**ప్రశంసలతో ముంచెత్తిన రైతులు**

**ఆలమూరు, ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే అనేక పంట కాలువలను అభివృద్ధి చేసి, వందలాది ఎకరాల్లో సక్రమంగా వరిసాగు చేపట్టేందుకు విశేష కృషి చేసి రైతు పక్షపాతిగా నిలిచిన గారపాటి శ్రీనివాస్ చౌదరిని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కొనియాడుతో ప్రశంసలతో ముంచెత్తారు. ఇటీవల ఆలమూరు, జొన్నాడ, పెనికేరు, కలవచర్ల గ్రామాల్లో ఉన్న వందలాది ఎకరాలకు సాగునీరును అందించే కోడు (మురికి) కాలువను రైతుల సహకారంతో ప్రత్యక్ష పర్యవేక్షణలో శుభ్రపరచినందుకు ఆయనను మండలంలోని పెనికేరులో సోమవారం పలువురు రైతులు అభినందించారు. ముందుగా ఆయనకు సాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సాగునీటి సంఘం పరిధిలోని కాలువల్లో పూడికతీత, గట్లపై వ్యర్థాలు తొలగించి సాగునీరు సక్రమంగా పారించిన తీరును వారు ప్రజలకు వివరించారు. అలాగే రైతుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న గారపాటి నియామకానికి కారకులైన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కు వారు కృతజ్ఞతలు తెలియజేసారు. అలాగే కాలువల వెంబడి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సువర్ణ వర్తక సంఘంపై తప్పుడు ప్రచారం తగదు

- **ఆరోపణలు నిరూపించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం**
- **శ్రీ సువర్ణ వర్తక సంఘం నేతలు అడపా శ్రీహరి, కూర్మదాసు ప్రభాకర్, గంటా ప్రకాష్ స్పష్టీకరణ**




**రాజమహేంద్రవరం, ఆగస్టు 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

స్వాతంత్ర్యం రాక పూర్వమే 1933లో ఏర్పడిన రాజమండ్రి శ్రీ సువర్ణ వర్తక సంఘానికి 92ఏళ్ళ ఘన చరిత్ర ఉందని సంఘ అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంఘ గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, గౌరవ కార్యదర్శి గంటా ప్రకాష్ చెప్పారు. ఎందరో మహనీయులు సారథ్యం వహించిన ఈ సంఘాన్ని ఈ మధ్యకాలంలో ఒక వ్యక్తి భ్రష్టు పట్టించడానికి పదే, పదే ప్రయత్నిస్తుండడం శోచనీయమని వారు విచారం వ్యక్తం చేసారు. స్థానిక శ్రీ సువర్ణ వర్తక సంఘ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం సంఘ ప్రతినిధులు వెత్సా బాబ్జి, కృష్ణదాస్ జవ్వార్, దొండపాటి జయసింహ, బొడ్డు రామారావు, సప్పా వెంకట రమణ, కొనగళ్ళ రాజు, ఎస్ ఎస్ వి ప్రసాద్, కడియాల రఘు, లక్కోజు వీరభద్రరావు (లక్కోజి), మామిడి వెంకట్రాజు, దినేష్ జైన్, కమలేష్ జైన్, జానకిరామ్, అల్లు చందు, చంద్రమోహన్ (సీఎం) ఏ. జేజిబాబు నాగులకొండ రమేష్, కెబి రాజు, సంజయ్ జైన్, దుద్దుపూడి నాని, కసిరెడ్డి రాము, అస్రార్, మట్టపల్లి వెంకటేష్, తొంటేపు, పులవర్తి కృష్ణ , గడాల సూర్యబాబు, రాయవరపు గోపాలకృష్ణ, కడియాల బుచ్చిరాజు, తదితరులతో కల్సి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక వ్యక్తి కొన్ని మీడియాల వేదికగా చేస్తున్న ప్రకటనల కారణంగా వాస్తవాలేమిటో తెలియజేయడానికి, తగిన వివరణ ఇవ్వడానికి తొలిసారిగా ఇలా మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని అడపా శ్రీహరి అన్నారు. గతంలో సంఘ పెద్దలు రాష్ట్ర సంఘాన్ని రాజమండ్రిలో స్థాపించి దాన్ని తదుపరి సంఘ అభివృద్ధి దృష్ట్యా సికింద్రాబాద్ వారికి ఇచారని ఆయన తెలిపారు. అలాగే జిల్లా సంఘాన్ని కూడా రాజమండ్రి సువర్ణ వర్తకుల సహకారంతో ఏర్పాటు చేసిందేనని తెలిపారు. గత కొద్ది రోజులుగా మాజీ పూర్వ అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ శ్రీసువర్ణ వర్తక సంఘం నాది ఇప్పుడు ఉన్న సంఘ కమిటీ ఆ ప్రజాస్వామికం అని సంఘాన్ని, సంఘ పెద్దలను, సభ్యులను కించపరిచే విధంగా ప్రకటనలు ఇవ్వడం శోచనీయమని అన్నారు. ఏ వ్యక్తి అయినా సంఘ మూలధనంతో సంఘాన్ని రిజష్టరు చేసి తన పదవి కాలపరిమితి పూర్తయ్యాక సంఘానికి సంబంధించిన మినిట్స్ బుక్ యావత్తు రికార్డు, జమా ఖర్చులు సంఘానికి అప్పజెప్పాలని ఆయన అన్నారు. అలాగే సదరు మాజీ అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ 2019 జులై 11న తదుపరి నూతన కమిటీని ప్రకటించడానికి సంఘ పెద్దలకు అప్ప చెపుతున్నట్లుగా పత్రికా ముఖంగా ప్రకటన ఇచ్చారని అడపా శ్రీహరి అందుకు సంబందించిన పత్రిక చూపించారు. అయితే పెద్దలు నిర్ణయించిన నూతన కమిటీకి సంఘానికి సంబంధించిన మినిట్స్ బుక్ రికార్డులు అప్పచెప్పకుండా, జమా ఖర్చులు యివ్వకుండా యిప్పుడు ఆరోపణలు చేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. 2019లో సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా, మాకు లాయరు నోటీసులు పంపించారని, ఇటువంటి సంఘ వ్యతిరేక చర్యలను గర్హిస్తూ, తదుపరి సర్వసభ్య సమావేశంలో సదరు వ్యక్తిని సంఘం నుండి సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో సంఘం నుండి బహిష్కరించినట్లు అడపా శ్రీహరి చెప్పారు. నిజానికి రాష్ట్రబులియన్, గోల్డ్, సిల్వర్, డైమండ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దొండపాటి శంకర్రావు ఆశీస్సులతో అధ్యక్షుడైన సదరు వ్యక్తి తదుపరి ఒక నియంత లాగ తన కార్యవర్గంలోని గౌరవ కార్యదర్శులను బహిష్కరించడం, వర్తకులను భయభ్రాంతులకు గురిచేయుట వలన సంఘ పెద్దలు అతని నుంచి సంఘాన్ని రక్షించే ఉద్దేశంతో 2019లో మా కమిటీకి సంఘ బాధ్యతలు అప్పజెప్పారని ఆయన వివరించారు. సదరు మాజీ అధ్యక్షుడు సంఘ పెద్దలను వ్యక్తిగతంగా అవమాన పరుస్తూ, కించపరిచే విధంగా ప్రవర్తించడం వలన సంఘంలో గౌరవంగా మసలుతున్న తమకు ఇబ్బంది కలగడంతో మొత్తం సభ్యులంతా ఏకమై నిజా, నిజాలు తెలియ చేస్తున్నామని తెలిపారు. ఎప్పటి నుంచో సంఘ భవనంలో 90శాతం మంది వర్తకుల సమక్షంలో జమాఖర్చులు ఆమోదం పొంది సభ్యుల మన్ననలతో ఏకగ్రీవ తీర్మానంతో మరో రెండు సంవత్సరములకు ఎన్నికవుతూ అనేక సేవాకార్యక్రమాలు, దైవ కార్యక్రమములు, సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించి ఎవరినీ నొప్పించకుండా కొనసాగుతూ సంఘ మూలధనాన్ని ఇతోధికంగా పెంచితే, మా కమిటీ మెంబర్ను, అలాగే సంఘ పెద్దలపైనా కోట్ల రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. అసలు శ్రీనివాస్ సంఘ అధ్యక్షునిగా ఉన్నకాలంలో సంఘానికి చేసిన సేవ ఏంటని, సంఘానికి ఎంత మూలధనం సమకూర్చారని ప్రశ్నించారు. దానికి సరియైన సమాధానం ఇవ్వకుంటే నీ హయాంలో సంఘానికి వచ్చిన రెవెన్యూ అంతా అక్రమంగా నీవద్ద ఉంచుకున్నావని భావించటం జరుగుతుందని అధ్యక్షులు అడపా శ్రీహరి, ప్రభాకర్ తెలిపారు. కూర్మదాసు ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీనివాస్ సంఘానికి అధ్యక్షుడు అవ్వడానికి నేను, దొండపాటి శంకర్రావు, కదం విలాస్, సంఘ పెద్దలు అందరం కలసి అతనికి అధ్యక్షున్ని చేస్తే, తిరిగి తమ మీద తప్పుడు ఆరోపణలు చేస్తూ, కించపరుస్తూ వ్యక్తిత్వహననానికి పాల్పడడం దారుణమన్నారు. తమ మీద చేసిన ఆర్థిక ఆరోపణలు, వ్యక్తిగత ఆరోపణలు నిరూపిస్తూ, 7 రోజుల లోపు సమాధానం చెప్పాలని లేకుంటే, మేము తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com



# కుప్పంకు కృష్ణమ్మ పరుగులు..

**యువగళంలో రైతులకు లోకేష్ ఇచ్చిన హామీ నెరవేరింది... రాయలసీమ ద్రోహిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచారు ....**

**రాయలసీమ ప్రాంత రైతులు చంద్రబాబుకు జై జైలు...**

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ....**



**అమరావతి, గస్టు 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కలసహకారం అయిందని హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా కుప్పం నుంచి కాలువకు కృష్ణానది జలాలు కుప్పం నియోజకవర్గం లోకి అడుగుపెడుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నలుగురు మంత్రుల వల్ల కానీ పనిని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు పూర్తి చేశారని 1987లో అన్న ఎన్టీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే నేడు చంద్రబాబు నాయుడు సారథ్యంలో పూర్తయిందని ఆయన తెలిపారు భగీరథుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 14 నెలల కాలంలోనే హంద్రీ నీవా కాలువను ఆధునికరించి 730 కిలోమీటర్లు దూరంలో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో కృష్ణా జలాలను పారించి రైతాంగానికి సాగునీరు అందించి భరోసా కల్పించారన్నారు 2014- 2019 మధ్యకాలంలో హంద్రీ నీవా ప్రాజెక్టుకు చంద్రబాబు ప్రభుత్వం నాలుగు పాయింటు 102 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి చేసిందని ఆయన తెలిపారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో 3.870 కోట్ల రూపాయలు విడుదల చేసి ఫేస్ వన్ ఫేస్ టు కాలువ లైనింగ్ పనులను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారే ప్రారంభించి అధికారులకు డెడ్లైన్ విధించి మరీ పనులను పూర్తి చేయించారని ఆయన తెలిపారు 2023 జనవరిలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ కుప్పం ప్రజలకు హామీ ఇచ్చి నేడు ఇచ్చిన మాటను నిలుపుకున్నారని ఆయన తెలిపారు సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీనీవా పనులు పూర్తి చేసి రాయలసీమ చరిత్రలో పోయే నాయకుడిలా అని చంద్రబాబు మాట నిలుపుకున్నారని ఆయన తెలిపారు జులై 17 న మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద నుంచి హంద్రీనీవాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నీటిని విడుదల చేశారని సరిగ్గా నలభై రోజుల్లో కుప్పంకు సాగునీరు అందించి అక్కడ పరమ సముద్రం వద్ద జల హారతి ఇవ్వనున్నారని ఆయన తెలిపారు వరదలు వస్తే శ్రీశైలం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడమే తప్ప సీమ ప్రజలకు సాగునీరు అందించాలని గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి ఆలోచన లేదని ఆయన విమర్శించారు సరిగ్గా ఎన్నికలకు మూడు నెలల ముందు 2024 ఫిబ్రవరి 27వ తేదీన కుప్పం నియోజకవర్గం రాజుపేట వద్ద చిన్న ఇనుప గేటును ఎత్తిన జగన్ రెడ్డి అపరభగీరథుడిలా బిల్డప్ ఇచ్చారని ఆయన విమర్శించారు ఉదయం గేట్లెత్తితే సాయంత్రానికి నీళ్లు మొత్తం ఖాళీ అయ్యాయని అద్దెకు తెచ్చిన ఆ గేట్లను కాంట్రాక్ట్ సమస్త వాళ్లు ఎత్తుకు వెళ్లారని ఆయన విమర్శించారు రాయలసీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ రెడ్డి రాయలసీమ ప్రజలకు ఉపయోగపడే హంద్రీనీవా కోసం ఐదేళ్ల పాలనల్లో చేసింది శూన్యమని సొంత కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి దోచుకోవటమే తప్ప రైతులకు సాగునీరు అందించాలన్న ఆలోచన జగన్ రెడ్డికి చేయలేదని ఆయన విమర్శించారు 2014 -2019 లో జగన్ రెడ్డి హంద్రీ నీవా కోసం 515.78 కోట్లు మాత్రమే ఖర్చు చేసి కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని ఆయన విమర్శించారు 2014-2019 మధ్య కాలంలో 12 వేల కోట్లు రాయలసీమ ప్రాజెక్టుల కోసం చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆయన తెలిపారు 2019 -2024 మధ్యకాలంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం ఐదేళ్ల బడ్జెట్ 12 లక్షల కోట్లలో 2వేల కోట్లు ఖర్చు చేయడానికి కూడా జగన్ రెడ్డి మనసు రాలేదని ఆయన విమర్శించారు కరువు తాండవించే ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించలేక రాయలసీమ ద్రోహిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారైన ఆయన తీవ్రంగా విమర్శించారు ఫేజ్ వన్ కాలువ విస్తరణలో కాలువ సామర్థం 2.200 క్యూసెక్కుల నుంచి 3.850 క్యూసెక్కులకు పెరిగిందని దీనితో 16 వేల క్యూసెక్కుల అదనపు నీరు రాయలసీమ ప్రాంతానికి అందుతుందని ఆయన తెలిపారు రాష్ట్రములో 14 నెలల కూటమి పాలనలో ఫేజ్ వన్ లో 118 వేల ఎకరాలకు పేజ్ 2 లో 404.500 అని ఎకరాలకు సాగునీరు అందుతుందని నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పట్టుదలతో హంద్రీనీవా పనులు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు మరొకసారి ముఖ్యమంత్రి అయ్యాకే నీటిని విడుదల చేస్తున్నారని ఆయన తెలిపారు దానితో రాయలసీమ ప్రాంత ప్రజలంతా రైతాంగమంతా చంద్రబాబుకు జై జైలు పలుకుతున్నారని పాతర్లరమేష్ తెలిపారు

# నేత్ర దాన అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి

# ప్రజల్లో చైతన్య కలిగించాలి

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**




**ఏలూరు, ఆగస్టు 25(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు గోడపత్రికలను జిల్లా అంథత్వ నివారణ సంస్థ అధ్యక్షులు, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య, మండల కేంద్రాలలో నేత్ర దాన అవగాహన సదస్సులు, ర్యాలీలు జరుపుటకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీ బ్యానరులు, ఎలక్ట్రానిక్ , ప్రింటు, సోషల్ మీడియా ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయుటకు కార్యాచరణ రూపొందించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్నియాలు అవసరం రోజు రోజుకి అవసరం పెరుగుతూ ఉందని, కార్నియాలు అవసరానికి మరియు సేకరణకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు.ఈ అంతరం పూరించడానికి దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుండి సెప్టెంబరు 08వ తేదీ వరకు జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నేత్ర దానంపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్చందగా నేత్ర దానానికి ముందుకు వచ్చి మరణానంతరం తమ నేత్రాల దానానికి సమ్మతించి నేత్ర దాన విజ్ఞాపన పత్రాన్ని నింపితే ఈ కార్యక్రమానికి మంచి ఫలితాలు వచ్చినట్లేనని అన్నారు. కార్నియాల లభ్యత అంధుల పాలిట వరమవుతుందని మన ఈ ప్రయత్నం అందరి సహకారంతో సఫలీకృతం కావాలని జిల్లా కలెక్టరు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఉపాధ్యక్షులు మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.జె .అమృతం, జిల్లాప్రోగ్రామ్ మేనేజరు డా.పి. మల్లిఖార్జున రాజు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సిబ్బంది, తదితరులు,పాల్గొన్నారు.

# పీపీపీ విధానంలో బాపట్ల మెడికల్ కాలేజీ నిర్మాణం

## తీరనున్న బాపట్ల వాసుల కల

**( 2025 ఆగష్టు 25, తెలుగు రాష్ట్రం, బాపట్ల ప్రతినిధి )**



రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నడిపేలా అడుగులు పడుతున్నాయి. మొత్తం పది వైద్య కళాశాలలను ఈ విధానంలోకి తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం 'ట్రాన్సాక్షన్ సర్వీస్' కింద సంస్థను టెండర్ ద్వారా ఎంపిక చేయనుంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో పీపీపీ, ఇతర పద్ధతుల్లో నడుస్తున్న వైద్య కళాశాలల పనితీరును పరిశీలిస్తోంది. త్రిపుర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు కూడా పీపీపీ విధానంలోనే కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుపై ప్రకటనలు చేశాయి. రాష్ట్రంలో పులివెందుల, మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లులోని ప్రభుత్వ వైద్యకళాశాలలను ఈ విధానంలో ప్రారంభించాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పీపీపీ విధానంలో కళాశాలల నిర్వహణకు 'ట్రాన్సాక్షన్ సర్వీస్' సంస్థను త్వరలో టెండర్ ద్వారా ఎంపిక చేయనున్నారు. మన రాష్ట్రంలో ఎంపికైన సంస్థ.. కళాశాలలు ఏర్పాటుకానున్న ప్రాంతాలు, వాటి ప్రాధాన్యం, అధ్యయనం చేస్తుంది. కళాశాలలు ప్రారంభించాక ఓపీ, ఐపీ అంచనాలు, రోగ నిర్ధారణ పరీక్షల యంత్రాలు/పరికరాల కొనుగోళ్లకు అయ్యే వ్యయం, వైద్యసీట్ల భర్తీ ద్వారా వచ్చే ఆదాయం, వైద్యుల జీతభత్యాలు, తదితర వివరాలతో నివేదికలు తయారుచేయిస్తోంది. యూపీలోని ఆరు జిల్లాల్లో వైద్య కళాశాలలు పీపీపీ విధానంలో నడుస్తున్నాయి. గుజరాత్లోనూ అదానీ సంస్థ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం కింద నిర్వహిస్తోంది. ఆసుపత్రి ప్రైవేటు యాజమాన్యం ఆధీనంలో ఉంటే, కళాశాలకు కావాల్సిన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుంది. ఆసుపత్రి ప్రైవేటు యాజమాన్యం ఆధీనంలో ఉంటే, కళాశాలకు కావాల్సిన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుంది. లేదా ప్రభుత్వమే కళాశాలను నిర్మించి ఇస్తుంది. మరో ఆప్షన్ ప్రకారం, ప్రభుత్వమే ఆసుపత్రి భవనాలు, స్థలాన్ని సమకూర్చి ఇస్తే, ప్రైవేట్ సంస్థలు నిర్వహణకు పరిమితమవుతాయి.

**లాభాపేక్ష లేకుండా వైద్యసేవలు**

గత వైకాపా ప్రభుత్వం సరైన ప్రణాళిక, నిధులు లేకుండానే వైద్య కళాశాలల ఏర్పాటుకు ఉపక్రమించింది. 17 కొత్త కళాశాలల ఏర్పాటుకు రూ.8,480 కోట్లు అవసరమని అంచనా వేసింది. ఇందులో రూ.4,948 కోట్లు నాబార్డు, సీఎస్ఎస్, కేంద్రప్రభుత్వ ప్రత్యేకనిధి కింద వస్తాయని తెలిపింది. ప్రస్తుతానికి 25% పనులే పూర్తయ్యాయి. నిధుల సమస్య తీవ్రంగా ఉంది. మొత్తంగా పది కళాశాలల నిర్మాణాలు కొంతవరకు చేశారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల మేరకు వీటి అనుబంధ ఆసుపత్రుల్లో పడకలు, వైద్య సదుపాయాలు కొంతవరకే అందుబాటులోకి వచ్చాయి దీంతో ఆయా నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం 'సేఫ్ సీ (ఉన్నవి ఉన్నట్లుగానే) కింద నిలిపేసింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించాలనుకున్న పాడేరు సహా మరో 4 కళాశాలల్లో వైద్యుల నియామకాలు పూర్తికాలేదు. వీటిని పీపీపీ విధానంలోకి మార్చబోతున్నందున ప్రైవేటు సంస్థలే వైద్యుల నియామకం చేపట్టి, నిర్వహణ ఖర్చులు భరించనున్నాయి. ఇందుకోసం ఎంపికచేసిన సంస్థలు ఐదేళ్లపాటు ఏటా రూ.75 కోట్ల వరకు ఖర్చుపెట్టాల్సి -రావొచ్చు. ఇందుకోసం ఎంపికచేసిన సంస్థలు ఐదేళ్లపాటు ఏటా రూ.75 కోట్ల వరకు ఖర్చుపెట్టాల్సి రావొచ్చు. ఒప్పందాన్ని బట్టి, యాజమాన్యాలు వైద్య సీట్ల భర్తీలో, ఆసుపత్రుల్లో రోగులకు పడకల కేటాయింపు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సల్లో లాభాపేక్ష లేకుండా వ్యవహరించాలి. కేంద్రం 'వయబులిటీ గ్యాప్ఫండ్' కింద అవసరమైన నిధుల్లో 45% వరకు అందిస్తుంది.

# క్రమశిక్షణ,అంకితభావంతో పని చేసే నాయకులకు పెద్దపీట

**బాపట్ల తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**



**(2025 ఆగష్టు 25, తెలుగు రాష్ట్రం, బాపట్ల ప్రతినిధి )** తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయకుడు ఆదేశాల మేరకు సోమవారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ ,రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ:- పరిశీలకులతో కలిసి పార్లమెంట్ కమిటీ,అనుబంధ కమిటీ, సాధికార కమిటీల నుంచి ప్రతిపాదనలను స్వీకరించడం జరిగిందని ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని అన్నారు. ఆయా కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయనం చేసి అధిష్టానానికి నివేదిస్తామని అన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంది. పార్టీ కోసం క్రమశిక్షణ,అంకితభావంతో పని చేసే నాయకులకు అధినేత నారా చంద్రబాబు , టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రివర్యులు నారా లోకేష్ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని తెలిపారు.కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే..ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని సగర్వంగా తెలియజేస్తున్నాను అని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి కార్యకర్తలు ప్రతి ఎన్నికల్లో అండగా ఉన్నారని అందుకు ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెట్టి ,వేధించినప్పటికీ వాటికి ఏమాత్రం భయపడకుండా టిడిపి విజయమే ధ్యేయంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కష్టంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కార్యకర్తలే టీడీపీకి కొండంత బలం అని అన్నారు. తెలుగుదేశం పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తించి అలాంటివారికి ప్రభుత్వంలో పెద్దపీట వేసిందని తెలిపారు. టిడిపి జిల్లా కమిటీలో ఎంతో పారదర్శకంగా అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించేలా పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీ వేసి జిల్లా టీడీపీ అధ్యక్షునితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేస్తోందని తెలిపారు.సామాన్య కార్యకర్తలకు కూడా తెలుగు దేశం పార్టీ గుర్తించి ఈ కమిటీల్లో ఎంపిక చేసి పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ ఎంతో నిబద్ధతతో ,క్రమశిక్షణకు పెద్దపీట వేసిందని చెప్పడానికి ఇదే నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేపట్టిందని తెలిపారు. ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిలోపే అమలు చేసి సూపర్ హిట్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతి అని కొనియాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి పని చేయాలని అన్నారు. అదే విధంగా సినీ హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 ఏళ్లు సినీ రంగ ప్రస్థానం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ కి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్లో చోటు సంపాదించడం ఎంతో అభినందనీయమని ఆయనకు ప్రత్యేకంగా బాపట్ల నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ,వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ,సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ , తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ , బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి , శాసనమండలి సభ్యులు,చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ , వీరంకి వెంకటగురుమూర్తి , మన్నే సుబ్బారెడ్డి , రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ మరియు బాపట్ల పార్లమెంట్ నాయకులు పాల్గొన్నారు.

# ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలి

**విద్యార్థులకు సిఎం దిశానిర్దేశం**


**7 కొత్త ఐఐటి, నీట్ కొచింగ్ సెంటర్లు ఏర్పాటుకు ఆదేశం**








**అమరావతి, ఆగస్టు 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** : మరింత కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని, భవిష్యత్ ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతోపాటు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో చదివి ఈ ఏడాది ఐఐటి, నీట్‌లలో విజయం సాధించిన 55 మంది విద్యార్థులను సచివాలయంలో ఆయన సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యా సంస్థలు రూపుదిద్దుకోవాలన్నారు. రాష్ట్ర విదార్థుల్లో ప్రతిభ కొదవ లేదన్నారు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీపడే సత్తా ఉందన్నారు. సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి 4 రెట్లు పెరగాలన్నారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్‌టిఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని ఐఐటి - నీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారన్నారు. ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. కొత్తగా ఏర్పాటుచేసే సెంటర్లతో 1,411 మంది ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ మెమెంటోలు, రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సమావేశంలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







# ధర్మాజీ గూడెం ఎరువులు షాపులపై జాయింట్ యాక్షన్ కమిటీ తనిఖీలు.





**ఏలూరు, ఆగస్టు 25(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీ గూడెం గ్రామంలో ఎరువులు షాపులపై జాయింట్ యాక్షన్ కమిటీ తనిఖీలు నిర్వహించారు.యూరియా మరియు ఎరువులు ఆక్రమణల నిలవలపై మరియు యూరియా ఎటువంటి బిల్లు లేకుండా రవాణా చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా అన్నారు. యూరియా పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు కూడా పెడతామని అన్నారు. ఈరోజు ధర్మాజీ గూడెం విలేజ్ లో ఎరువుల షాపులపై జెడి భాష, AD సుబ్బారావు,ఏవో ప్రదీప్ కుమార్, ధర్మాజీగూడెం సబ్ ఇన్స్పెక్టర్, K. వెంకన్న సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతానికి వరి పంటకు మాత్రమే యూరియా అందించాలని, ఉద్యాన శాఖ పంటలైన మొక్కజొన్న, పామాయిల్ పంటలకు ప్రస్తుతానికి యూరియా ఇవ్వద్దని జెడి తెలిపారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com



# కాంతా' వాయిదా!

దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కాంత' చిత్రం విడుదల వాయిదా పడినట్లు తెలుస్తోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాను 1950 మద్రాసులో జరిగిన ఒక ఉత్కంఠభరితమైన నాటకీయ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, వేఫారేర్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రానా దగ్గుబాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సముద్రఖని కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని గతంలో చిత్ర బృందం ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం కొత్త విడుదల తేదీ త్వరలో ప్రకటిస్తారు.

# 30న షార్జాలో 'గామా' వేడుకలు



ఈ నెల 30న దుబాయ్ లోని షార్జా ఎక్స్పోసెంటర్‌లో గామా (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్) -5వ ఎడిషన్ వేడుకలు జరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఆకట్టుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లుగా గామా సిఇఒ సౌరభ్ కేసరి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కర్టన్ రైజర్ ఈవెంట్‌లో ఈ వేడుకలకు జ్యూరీ సభ్యులుగా దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్‌తోపాటుగా కథానాయికలు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్ష నాగర్కర్, నటుడు వైవా హర్ష తదితరులు హాజరయ్యారు. సౌరభ్ కేసరి మాట్లాడుతూ 'కళలు, కళాకారులపై ఉన్న అభిమానంతో మొదలైన వేడుకలను భవిష్యత్తులో ఇతర దేశాల్లోనూ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జ్యూరీ సభ్యుల సహకారంతో ప్రతిభావంతులకు పురస్కారాలను అందజేస్తామన్నారు. కథానాయకులు, దర్శకులు, సంగీత దర్శకులు, గాయకులతోపాటు ఇతర విభాగాలకు చెందిన సినీ ప్రముఖులు కూడా ఈ వేడకలకు హాజరవుతున్నారని వివరించారు.




# టార్ హీరో తల్లి చేతికి..
## 'ఘాటి' రిలీజ్ హక్కులు



బెంగళూరు: అనుష్క ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటి'. ఈ సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. అయితే ఈ సినిమా కర్ణాటక రిలీజ్ హక్కులను కన్నడ స్టార్ హీరో యశ్ తల్లి పుష్ప దక్కించుకున్నారు. పుష్ప కొద్ది రోజుల క్రితమే సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తన భర్త అరుణ్ కుమార్‌తో కలిసి ఆమె PA ప్రొడక్షన్స్ అనే బ్యానర్‌ను స్థాపించారు. ఈ మధ్యకాలంలోనే 'కొత్తలవాడి' అనే కన్నడ చిత్రాన్ని ఈ బ్యానర్‌పై నిర్మించి విడుదల చేశఆరు. ఇప్పుడు అనుష్క నటించిన ఘాటి సినిమా కర్ణాటక రిలీజ్ హక్కులను ఆమె సొంతం చేసుకున్నారు. ఇక ఘాటి (Ghaati) సినిమా విషయానికొస్తే.. కొండ ప్రాంతంలో నివసించే ప్రజల చుట్టూ, మాదకద్రవ్యాల చుట్టు తిరిగే కథ ఇది. కొద్ది రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అభిమానులకు విపరీతంగా నచ్చింది. ఈ సినిమాలో అనుష్కతో పాటు విక్రమ్ ప్రభు, జగపతి బాబు, చైతన్యరావు తదితరులు కీలక పాత్రలు పోషించారు. క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాకు దర్శకుడు. యువి క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే చాలాసార్లు ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఎట్టకేలకు సెప్టెంబర్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# కేజీఎఫ్ నటుడు దినేష్ కన్నుమూత



బెంగళూరు : సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. యష్ హీరోగా వచ్చిన కేజీఎఫ్ లో బాంబే డాన్ శెట్టి పాత్రలో నటించిన దినేష్ మంగళూరు (63) కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న ఆయన.. సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని దినేష్ కుటుంబం వెల్లడించింది. మంగళవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దినేష్ మరణ వార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. కాగా, దినేష్ మంగళూరు నటుడిగానే కాకుండా దాదాపు 200 చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. వీర మదకరి, చంద్రముఖి ప్రాణసకి, రాక్షస వంటి సినిమాల్లో ఆర్ట్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందారు. దినేష్ ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తుండగానే మరణించారు.


# సినిమా పరంగానే కాదు
# వ్యక్తిగత విషయాల్లోనూ అంతే
## అనుపమ పరమేశ్వరన్



కమర్షియల్ సినిమాలలో ఎన్ని తప్పులు ఉన్నా ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరని, కానీ తమలాంటి వాళ్ల చేసిన ప్రయోగాత్మక, నాయికా ప్రాధాన్య చిత్రాలలో మాత్రం తప్పులు వెతుకుతున్నారని నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన 'పరదా' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనపై చిత్రబృందం సోమవారం హైదరాబాద్‌లో థాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అనుపమ తన అభిప్రాయాలను పంచుకున్నారు. కొంతమంది వినోదాత్మక చిత్రాలను ఇష్టపడితే, మరికొందరు కథాబలం ఉన్న సినిమాలను ఆదరిస్తారని అనుపమ తెలిపారు. 'పరదా' చిత్రాన్ని తాను ఎంతో ఇష్టపడి చేశానని, అయితే కొందరు దీనిని ప్రయోగాత్మక చిత్రం అని చెబుతూనే అందులో లోపాలను వెతకడంపై దృష్టి పెడుతున్నారని ఆమె అన్నారు. "కమర్షియల్ చిత్రాల్లో వెయ్యి తప్పులున్నా ఎవరూ ప్రశ్నించరు. కానీ లేడీ ఓరియెంటెడ్ సినిమాల విషయానికి వచ్చేసరికి విమర్శలు ఎక్కువగా ఉంటాయి. సినిమా పరంగానే కాకుండా వ్యక్తిగత జీవితం విషయంలోనూ ఇలాంటి ధోరణులే కనిపిస్తుంటాయి. కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే సగం మంది విమర్శిస్తుంటారు. మేం పడిన కష్టాన్ని గుర్తిస్తే ఇలాంటి కొత్త కథలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది" అని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల భావోద్వేగానికి గురయ్యారు. తెలుగు ప్రేక్షకులు మంచి కథలను ఆదరిస్తారనే నమ్మకంతోనే ఈ సినిమా తీశామని, కానీ కొందరు మంచి కంటెంట్‌ను విస్మరించి తప్పులు వెతకడంపైనే దృష్టి సారిస్తున్నారని ఆయన అన్నారు. "సినిమా విడుదలై కొద్ది రోజులే అయింది, అప్పుడే విమర్శించడం సరికాదు. ఇలాంటి కాన్సెప్ట్ తెలుగులో ఇంతకుముందెన్నడూ రాలేదు. ముఖం కనిపించని పాత్రలో నటించేందుకు ఒప్పుకున్న అనుపమ ధైర్యం గొప్పది. ఆమెకు ఈ సినిమాతో జాతీయ అవార్డు రావాలి" అని ప్రవీణ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నటుడు రాగ్ మయూర్ కూడా పాల్గొన్నారు.




# టెన్నిస్ ఆటకు క్విటోవా గుడ్‌బై



న్యూయార్క్: రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవా సంచలన నిర్ణయం తీసుకుంది. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిరౌండ్‌లో ఓటమి అనంతరం టెన్నిస్ ఆటకు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించింది. 'తాను టెన్నిస్ మ్యాచ్‌లు ఆడేటప్పుడు మద్దతు పలికిన అభిమానులకు, కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు తన దేశ టెన్నిస్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపింది. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేస్తానని ఆశించినా.. ఇదే నా చివరి మ్యాచ్ కావడం నిరాశపరిచింది' అని భావోద్వేగంతో తెలిపింది. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో క్విటోవా 1-6, 0-6తో డయానే పెర్రీ చేతిలో చిత్తుగా ఓడింది. మాజీ నంబర్ 2 క్రీడాకారిణి అయిన క్విటోవా.. కెరీర్‌లో 31 డబ్ల్యుటిఎ టైటిళ్లు, 6బిల్లీ జీన్ కింగ్ ట్రోఫీలను కైవసం చేసుకుంది. ఓపెన్ ఎరాలో చెక్ రిపబ్లిక్ తరఫున 62మ్యాచుల్లో విజయం సాధించింది. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రారంభానికి ముందే టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు క్విటోవా ప్రకటించింది.

# తొలిరౌండ్‌లోనే ఓడిన లక్ష్యసేన్
## బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



పారిస్: బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్ గేమ్‌లో లక్ష్యసేన్ ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు షి-యు-క్యూ చేతిలో 17-21. 19-21తో ఓటమిపాలయ్యాడు. రెండు గేమ్‌లలోనూ చివరి వరకు పోరాడిన లక్ష్యసేన్.. టాప్‌సీడ్ అనుభవం ముందు నిలువలేకపోయాడు. హెచ్‌ఎస్ ప్రణరు, పివి సింధు తమ తొలిరౌండ్ గేమ్‌లను మంగళవారం ఆడనున్నారు. ఇక పురుషుల డబుల్స్‌లో 9వ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంటకు బై లభించింది.

# పసిడితో మెరిసిన మీరాబాయి
## కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్స్




అహ్మదాబాద్: భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానూ మరో పతకంతో మెరిసింది. కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో రికార్డు బ్రేకింగ్ ప్రదర్శన తో స్వర్ణం కొల్లగొట్టింది. సోమవారం జరిగిన 48 కిలోల విభాగం ఫైనల్లో మీరాభాయి 193 కిలోలు ఎత్తి పసిడి పతకం పట్టేసింది. వరల్డ్ ఛాంపియన్ షిప్స్‌లో సత్తా చాటాలనుకుంటున్న మీరాకు ఈ విజయం బూస్ట్‌లా ఉపయోగ పడనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన మీరాబాయి ఏడాది కాలంగా వెయిట్ లిఫ్టింగ్‌కు దూరంగా ఉంది. కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్ కోసం మళ్లీ బరువులు ఎత్తిన ఆమె తన శక్తికి మించిన ప్రదర్శన కనబరచాలనుకుంది. తొలి ప్రయత్నంలో 84 కిలోలు ఎత్తిన మీరా.. రెండోసారి ఏకంగా 109 కిలోలు ఎత్తి విజేతగా నిలిచింది. 'స్వర్ణ పతకం గెలుపొందడం చాలా సంతోషంగా ఉంది. ఏడాది తర్వాత సొంతగడ్డపై గోల్డ్ మెడల్ సాధించ డం ఎంతో ప్రత్యేకంగా ఉంది. ప్రేక్షకులు ఇచ్చిన మద్దతు కొండంత బలాన్నిచ్చింది. నిరంతర శ్రమ వల్లనే ఈ విజయం సాధ్యమైంది. నా కోచ్ సూచనలు, దేశ ప్రజల మద్దతు నాకు ఎంతో ప్రేరణ ఇచ్చాయి. మరింత ఆత్మవిశ్వాసంతో అక్టోబర్‌లో జరుగబోయే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు సిద్ధమవుతా%ా%' అని మీరాబాయి తెలిపింది. మలేషియా కు చెందిన ఇరెనే హెన్రీకి రజతం, నికోలే రాబర్ట్స్(వేల్స్)కు కాంస్యం దక్కాయి.

# ఎన్‌ఒసికి విహారి దరఖాస్తు



విశాఖపట్నం: టీమిండియా మాజీ ఆటగాడు హనుమ విహరి కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఆంధ్ర క్రికెట్ సంఘం(ఎపిఎల్)కు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'(ఎన్‌ఒసి) కావాలంటూ దరఖాస్తు చేసుకున్నాడు. గతంలో కెప్టెన్సీ నుంచి తప్పించడం, ఒక రాజకీయనేత కుమారిడి ప్రోధ్బలంతో తనను తప్పుపట్టడం వంటి కారణాలతో ఏసీకే పట్ల అసంతృప్తితో ఉన్న విహరి తనకు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' ఇవ్వాలని కోరాడు. 'నేను జట్టు మారాలని అనుకుంటున్నా. త్రిపుర సెలెక్టర్లు నాతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాబట్టి నాకు ఎన్‌ఒసి ఇవ్వగలరు' అని విహరి ఆంధ్ర క్రికెట్ సంఘానికి విన్నవించాడు. రంజీల్లో రాణించి భారత జట్టుకు ఎంపికైన విహరి 16 టెస్టులు ఆడాడు. ఆస్ట్రేలియా పర్యటన (2021-22)లో టీమిండియా టెస్టు సిరీస్ నెగ్గడంలో విహరి కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. రంజీ ట్రోఫీ 2023-24 క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రా జట్టు మధ్యప్రదేశ్ చేతిలో 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈమ్యాచ్ అనంతరం విహరి.. తాను ఆంధ్రా జట్టును వీడుతున్నట్టు పోస్ట్ పెట్టాడు. ఆంధ్రా తరఫున 37 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు.

# జకోవిచ్ శుభారంభం
## మెద్వెదేవ్ ఔట్.. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



నూయార్క్: రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ యుఎస్ ఓపెన్‌లో శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో జకోవిచ్ వరుససెట్లలో అన్‌సీడెడ్, అమెరికాకు చెందిన టెయిన్‌ను చిత్తుచేశాడు. రెండోసెట్ మినహా.. మిగిలిన రెండుసెట్లను సునాయాసంగా విజయం సాధించి రెండోరౌండ్‌కు చేరాడు. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో 7వ సీడ్‌గా బరిలోకి దిగిన జకోవిచ్ 6-1, 7-6(7-3), 6-2తో ఎల్.టెయన్‌ను ఓడించాడు. ఇక ఐదుసెట్ల హెూరాహెూరీ పోరులో నకాషిమా(అమెరికా) 6-2, 6-7(5-7), 2-6, 6-2, 7-6((10-7)తో జెన్సరీ(ఫ్రాన్స్)ను చిత్తుచేశాడు. ఇక 13వ సీడ్ మెద్వదెవ్(రష్యా) 3-6, 5-7, 7-6(7-5), 6-0, 4-6తో అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు.

**పోలిని, నవార్రో, పెగూలా ముందుకు..**

మహిళల సింగిల్స్‌లో స్థానిక క్రీడాకారిణులు పెగూలా, నవార్రాతోపాటు పోలిని రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో అమెరికాకు చెందిన 4వ సీడ్ పెగూలా 6-0, 6-4తో షెరీఫ్(కజకిస్తాన్)ను, 10వ సీడ్ నవార్రో 7-6(11-9), 6-3తో వాంగ్(చైనా)ను చిత్తుచేయగా.. 7వ సీడ్, ఇటలీకి చెందిన పోలిని 6-2, 7-6(7-4)తో అలావా(ఆస్ట్రేలియా)ను ఓడించారు. ఇక టాప్‌సీడ్ అర్యానా సబలెంక(బెలారస్) 7-5, 6-1తో డెన్మార్క్‌కు చెందిన మసరోవాను ఓడించి రెండోరౌండ్‌లోకి ప్రవేశించింది.

# డ్రీమ్ 11తో బిసిసిఐ కటీఫ్




న్యూఢిల్లీ : భారత క్రికెట్‌కు ప్రధాన స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11తో బిసిసిఐ ఒప్పందం రద్దు చేసుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో బిసిసిఐ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ ఇలాంటి సంస్థలతో సంబంధాలు కొనసాగించబోమని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దేశంలో అమలులో ఉన్న చట్టాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించబోమని, భవిష్యత్తులో ఇలాంటి సంస్థలతో బిసిసిఐకి ఎలాంటి సంబంధం ఉండబోదని స్పష్టం చేశారు. డ్రీమ్ 11 మూడేళ్ల కాలానికి 2023లో బిసిసిఐతో రూ.358 కోట్లతో ఈ ఒప్పందం చేసుకుంది. ఒప్పందం ప్రకారం చట్టపరమైన కారణాలతో మధ్యలో స్పాన్సర్‌షిప్‌ను వదిలేసినా.. ఎలాంటి జరిమానా పడకుండా నిబంధన ఉన్నట్లు సమాచారం. మరోవైపు పలు ఐపిఎల్ ఫ్రాంచైజీలకూ డ్రీమ్ 11 స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ జట్లు కూడా ఇప్పుడు సంబంధాలు తెంచుకునే అవకాశాలున్నాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339